www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

మంగళవారం | 17 | ఫిబ్రవరి | 2026 పేజీలు : 8

# ఆవిష్కృతమైన చారిత్రిక ఘట్టం

## -కొత్తగూడెం మేయర్ పీఠంపై సిపిఐ






సోమవారం చరిత్రలో నిలిచిపోయేవిధంగా ఒక చారిత్రిక ఘట్టం ఆవిష్కృతమైంది. ఎన్నో దశాబ్దాల కమ్యూనిస్టు కార్యకర్తల కల నిజమైంది. నెరవేరింది. ఎన్నికల్లో గెలుపోటములను డబ్బు, అధికారం శాసిస్తున్న ఈరోజుల్లో కమ్యూనిస్టు పార్టీ ఒక నగర పాలక సంస్థను చేజిక్కించుకోవడం అది ఒంటరిగా పోటీ చేసి అధ్యక్ష పీఠాన్ని అధిష్టించడం సామాన్య విషయం కాదు. 1981లో ఆ తర్వాత 1995లో వామపక్షాలు ఉమ్మడిగా పోటీ చేసి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నగర పాలక సంస్థ ఎన్నికల్లో ఘన విజయం సాధించాయి. విజయవాడ తొలి మేయర్‌గా సిపిఐ నేత టి. వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆ తర్వాత నగర పాలక సంస్థలు లేదా మున్సిపాలిటీలలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా కమ్యూనిస్టులు గెలుపొందడమే తప్ప అధ్యక్ష పీఠాన్ని అధిష్టించిన సందర్భం లేదని చెప్పవచ్చు. గతంలో కొత్తగూడెంతో పాటు మరికొన్ని చోట్ల మున్సిపాలిటీలలో వైస్ ఛైర్మన్ స్థానాన్ని గెలుచుకున్న ఘటనలు ఉన్నాయి కానీ మున్సిపల్ ఛైర్మెన్లుగా, మేయర్లుగా ఎన్నిక కావడం మాత్రం నాటి విజయవాడ తర్వాత ఇప్పుడు కొత్తగూడెంలోనే సాక్ష్యాత్కరించింది. కొత్తగూడెం గతంలో మున్సిపాలిటీగా ఉండేది. కూనంనేని సాంబశివరావు (సిపిఐ రాష్ట్ర కార్యదర్శి) కొత్తగూడెం నుంచి శాసన సభ్యునిగా ఎన్నికైన తర్వాత అనేక దశాబ్దాలుగా వివిధ కారణాలతో ఎన్నికలు నిర్వహించని పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు జరపాలంటే కార్పొరేషన్ ఏర్పాటు ఒక్కటే ప్రత్యామ్నాయమని భావించి కార్పొరేషన్ ఏర్పాటు దిశగా చకచకా పావులు కదిపారు. పాల్వంచ, కొత్తగూడెంతో పాటు సుజాతనగర్‌లోని కొన్ని ప్రాంతాలను కలుపుతూ స్థానికులను ఒప్పించి మెప్పించి ఏజెన్సీ చట్టాలు అడ్డు తొలగించుకుంటూ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడంలో ఆయన సఫలీకృతమయ్యారు. కార్పొరేషన్ ఏర్పాటైన తర్వాత ఎన్నికల నిర్వహణ అనివార్యమైంది. కమ్యూనిస్టు పార్టీకి కొత్తగూడెం ప్రాంతంలో ఆది నుంచి పట్టుంది. పాలకులుగా ఎవరున్నా బలమైన ప్రతిపక్షంగా కొత్తగూడెం మున్సిపాలిటీలో సిపిఐ తన పాత్రను పోషించింది. దివంగత సిపిఐ నాయకులు బరిగల సాయిలు, ప్రస్తుత సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా లు కొత్తగూడెం మున్సిపల్ వైస్ ఛైర్మెన్లుగా పనిచేశారు. క్షేత్ర స్థాయిలో బలమైన పునాదులు ఉన్న కొత్తగూడెంతో పాటు కూనంనేని సాంబశివరావు శాసన సభ్యునిగా ఎన్నికైన తర్వాత పాల్వంచలో పార్టీ త్వరితగతిన విస్తృతమైంది. గతేడాది చివరిలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పాల్వంచ మండలంలో ఎవరు ఊహించని రీతిలో గ్రామ పంచాయతీలను సిపిఐ గెలుపొందింది. పాల్వంచ పట్టణం ఒక విలక్షణమైంది. పారిశ్రామిక పట్టణంతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు జీవించే ఇక్కడ పార్టీని బలోపేతం చేయడం అంత తేలిక కాదు. కొంత క్లాసు కొంత మాసు కలగలిసి ఈ ప్రాంతంలో సిపిఐ కొత్తగూడెం జిల్లా సమితి శాసన సభ్యునిగా కూనంనేని ప్రత్యేక దృష్టిసారించి బలమైన పార్టీగా తీర్చిదిద్దారు. సుజాతనగర్‌లో ఆది నుంచి కమ్యూనిస్టు పార్టీకి పట్టుంది. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ ఎన్నికలు రావడంతో సహజంగానే సిపిఐ బలమైన రాజకీయ పార్టీగా బరిలోకి దిగింది. మిత్రపక్షమైన కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరిపినప్పటికీ ఉమ్మడి పోటీపై కొన్ని సమస్యలు తలెత్తాయి. ఈ పరిస్థితుల్లో సిపిఐ ఎక్కడ మిత్ర బేధానికి తావివ్వకుండా భారత రాష్ట్ర సమితి మిత్రుత్వానికి చేయి చాపి కలిసి పోటీ చేద్దామని పలుమార్లు ఆహ్వానించిన కలిస్తే మిత్రపక్షమైన కాంగ్రెస్‌తో లేదంటే ఒంటరిగానే బరిలోకి అని సిపిఐ తేల్చి చెప్పింది. చెప్పినవిధంగానే తెలుగుదేశంతో కలిసి కార్పొరేషన్ ఎన్నికల బరిలోకి దిగింది. అధికార పక్షంగా పోటీలో ఉన్న కాంగ్రెస్‌తోనూ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బిఆర్‌ఎస్‌ను తట్టుకుని 22 స్థానాల్లో విజయం సాధించడంతో పాటు మరో స్థానంలో స్వతంత్ర అభ్యర్థిని గెలిపించుకున్నది. రాష్ట్రంలో, దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో లౌకిక శక్తుల ఐక్యత రాజ్యాంగ పరిరక్షణతో పాటు మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాల్సిన నేపథ్యంలో కాంగ్రెస్‌తో పనిచేయాల్సి ఉన్నందున సిపిఐ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక విషయంలో తిరిగి కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరిపింది. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నర్సింహా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తోనూ, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ తోనూ ఇటు రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతోనూ చర్చలు జరిపారు. ఇరు పక్షాలు చర్చల అనంతరం ఏకాభిప్రాయానికి వచ్చారు. కాంగ్రెస్ 22 స్థానాల్లో గెలువగా సిపిఐ కూడా 22 స్థానాల్లో గెలుపొందింది. చెరి రెండున్నర ఏళ్లు మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను స్వీకరించేవిధంగా ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందం నేపథ్యంలో సోమవారం జరిగిన మేయర్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపి రఘురాం రెడ్డి తో పాటు ఆ పార్టీకి చెందిన 22 మంది కార్పొరేటర్లు, శాసన సభ్యులు కూనంనేనితో పాటు సిపిఐ నుంచి గెలుపొందిన 22 మంది సభ్యులు మేయర్ ఎన్నికలో పాల్గొన్నారు. 20వ వార్డు నుంచి సిపిఐ కార్పొరేటర్‌గా గెలుపొందిన మూడ్ గణేష్‌ను మేయర్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన సిరిపురపు లలితకుమారిని డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నారు. కమ్యూనిస్టు పార్టీ మేయర్ స్థానాన్ని అధిష్టించింది. ఇది కమ్యూనిస్టు శ్రేణులకు ఒక సరికొత్త ఊపునిచ్చింది. ధన ప్రభావం పెరిగి ఎన్నికల్లో కమ్యూనిస్టులు ప్రభావం చూపలేకపోతున్న దశలో ఈ గెలుపు భవిష్యత్తుకు ఒక స్ఫూర్తిదాయకంగా నిలవనుంది. ఒక పక్క లౌకిక, రాజ్యాంగ, ప్రజల హక్కుల పరిరక్షణకు పరిశ్రమిస్తూనే మరోక పక్క ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం నిర్వహిస్తున్న సిపిఐ మేయర్ పదవిని అధిష్టించడం ద్వారా కమ్యూనిస్టు శ్రేణులకు ఒక నూతన శక్తిని ఇచ్చింది. ముమ్ముందు ఈ గెలుపు మరెన్నో విజయాలకు నాంది పలక నుంది. ఒంటరిగా పోటీ చేయడం తర్వాత ఒక అద్భుత విజయాన్ని సాధించడం ఆ విజయాన్ని మేయర్ పదవిని అధిష్టించడం ద్వారా సంపూర్ణం చేయడం అనేది ఒక చారిత్రిక ఘటన. ఈ ఘటనకు కారకులైన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా విప్లవాభివందనలు. అధికారం కోసం అడ్డదారులు తొక్కకుండా తమ పంథానే కొనసాగిస్తూ ముందుకు సాగిన సిపిఐ బాట ఇప్పుడు ఎందరికో మార్గదర్శకంగా నిలిచింది. ముమ్ముందు ఇదే రీతిగా నిలవాలని చారిత్రిక విజయాలను సొంతం చేసుకోవాలని ఆశీస్తూ, ఆకాంక్షిస్తూ ...

ఏనుగు వెంకటేశ్వరరావు
ప్రజాపక్షం/ఖమ్మం

# ప్రశాంతంగా ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక

-కొత్తగూడెంలో సిపిఐ..
ఇల్లందులో వాయిదా
-మిగిలిన అన్నింటా
కాంగ్రెస్‌కే దక్కిన పీఠం

2 లో





# కొలువుదీరిన కార్పోరేషన్ పాలక మండలి

- మేయర్‌గా మూడ్ గణేష్
- డిప్యూటీ మేయర్‌గా లలిత కుమారి
- చెరో రెండున్నరేళ్ల పాలన
- బిఆర్ఎస్ కార్పోరేటర్లు గైర్హాజర్
- ర్యాలీగా కార్పోరేషన్ కార్యాలయానికి
- సందడిగా మారిన ప్రాంగణం







2 లో

# కొలువుదీరిన కార్పోరేషన్ పాలక మండలి

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పోరేషన్ తొలి పాలకవర్గ కొలువుతీరింది. మేయర్‌గా మూడ్ గణేష్ (20వ డివిజన్) డిప్యూటీ మేయర్‌గా సిరిపురపు లలితకుమారి (8వ డివిజన్)లు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. తొలూత ఆయా డివిజన్ల నుండి గెలుపొందిన వారితో కార్పోరేటర్లుగా జిల్లా జాయింట్ కలెక్టర్ వేణుగోపాలరావు ప్రమాణస్వీకారం చేయించిన అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ల ఎంపిక జరిగింది. సిపిఐ కార్పోరేటర్ అడుసుమిల్లి సాయిబాబా మేయర్‌గా మూడ్ గణేష్‌ను ప్రతిపాదించగా స్వతంత్ర కార్పోరేటర్ కంభంపాటి దుర్గాప్రసాద్ బలపరిచారు. డిప్యూటీ మేటర్‌గా సిరిపుర పులలిత కుమారిని కనుకుంట్ల శ్రీనివాస్ ప్రతిపాదించగా బోయిన విజయ్ కుమార్ బలపరిచారు. దీంతో మూడు రోజుల ఉత్కంఠతకు తెరపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాణ స్వీకార వేడుకలో ఎక్స్ ఎఫిషియో సభ్యులుగా ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు.

**చెరో రెండున్నరేళ్లు పాటు :**

అభ్యర్థుల నామినేషన్ల నాటి నుండి ఎన్నికల ఫలితాలు వెలువడి, పదవులు చేపట్టేంత వరకు తీవ్ర ఉత్కంఠ వాతావరణం కార్పోరేషన్ వ్యాప్తంగా నెలకొంది. ప్రధానంగా సిపిఐ, కాంగ్రెస్ పార్టీలకు సీట్లు సమానంగా రాగా మేయర్ పీఠం ఎవరిని వరిస్తుందో అనే టెన్షన్ నెలకొంది. కాగా సిపిఐ, కాంగ్రెస్‌ల అగ్రనాయకత్వం చర్చోపచర్చల అనంతరం ఐదేళ్ల పాలనను చెరో రెండున్నరేళ్ల పాటు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఒప్పందంలో భాగంగా తొలి రెండున్నరేళ్లు సిపిఐ కు చెందిన మూడ్ గణేష్ మేయర్‌గా, కాంగ్రెస్‌కు చెందిన సిరిపురపు లలిత కుమారి డిప్యూటీ మేయర్‌గా పదువులు చేపట్టారు. మరో రెండున్నరేళ్లు మేయర్‌గా కాంగ్రెస్, డిప్యూటీ మేయర్ పదవిని సిపిఐ చేపట్టనుంది. దీంతో కొత్తగూడెం తొలి కార్పోరేషన్ పాలక మండలి కొలువుతీరింది. ఇందిలా ఉండగా బిఆర్ఎస్ నుండి గెలిచిన ఎనిమిది మంది కార్పోరేటర్లు గైర్హాజరయ్యారు.

**సమిష్టిగా :**

ఇరు పార్టీల అగ్రనాకత్వం ఒప్పందం ప్రకారం సమిష్టిగా కలిసి ముందుకు సాగేందుకు నిర్ణయించుకున్నారు. ఇందు కోసం ప్రమాణ స్వీకారానికి ముందుగా ఓ హోటల్లో ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పల్లా వెంకటరెడ్డి, భాగం హేమంతరావు,జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాలు కార్పోరేటర్లతో ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. జరిగిన ఒప్పందాన్ని వారికి వివరించి అది నాయకత్వం మాటే శిరోధార్యమని చెప్పి మేయర్, డిప్యూటీ మేయర్ పేర్లను ప్రకటించారు. అనంతరం ర్యాలీగా కార్పోరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో దారి పోడవునా సందడి వాతావరణం నెలకొంది. ర్యాలీలో అగ్రభాగాన కూనంనేని నిలవడంతో పెద్ద ఎత్తున అభివాదాలు, నినాదాలు మిన్నంటాయి.

**సందడి సందడి :**

ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా కార్పోరేషన్ కార్యాలయం ఆవరణ సందడిగా మారింది. ఇరు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో పాటు మేయర్, డిప్యూటీ మేయర్, కార్పోరేటర్ల బంధువులు, స్నేహితులు, అభిమానులు, సన్నిహితులతో ఆ ప్రాంగణం జనసంద్రమైంది. ప్రామాణ స్వీకారం అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్, కార్పోరేటర్లు బయటకు రాగా పెద్దపెట్టున నినానాదలు చేశారు. వారిని కులుసుకుని అభినందనలు తెలిపేందుకు ఎగబడ్డారు.

# ప్రశాంతంగా ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కొత్తగూడెం కార్పోరేషన్ మేయర్ ఎన్నికతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగిన మున్సిపల్ ఛైర్మెన్లు, వైస్ ఛైర్మెన్ల ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఇల్లందులో ఛైర్మన్ అభ్యర్థి విషయంలో ఏకాభిప్రాయం రాకపోవడం సకాలంలో కౌన్సిలర్లు హాజరుకాకపోవడంతో ఇల్లందు మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. కొత్తగూడెం మేయర్‌గా మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్‌గా సిరిపురపు లలితకుమారి ఎన్నికయ్యారు. మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు, ఏదులాపురం, అశ్వారావుపేటలో ఛైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మధిర మున్సిపల్ ఛైర్మన్‌గా సామినేని సుజాత ఎన్నిక కాగా వైస్ ఛైర్మన్‌గా ధనికుమార్ ఎన్నికయ్యారు. వైరా మున్సిపల్ ఛైర్మన్‌గా డా॥ కాపా చంద్రకళ ఎన్నిక కాగా వైస్ ఛైర్మన్‌గా కట్ల సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. అశ్వారావుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా జూపల్లి శశికళ, వైస్ ఛైర్మన్‌గా ఆమె భర్త జూపల్లి రమేష్ ఎన్నికయ్యారు. ఏదులాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా పోకబత్తిని అనిత, వైస్ ఛైర్మన్‌గా తమ్మినేని నవీన్ ఎన్నికయ్యారు. సత్తుపల్లి మున్సిపల్ ఛైర్మన్‌గా రెహనా బేగం, వైస్ ఛైర్మన్‌గా బొంతు సుమలత ఎన్నికయ్యారు. కల్లూరు మున్సిపల్ ఛైర్మన్‌గా దారవత్ మోహన్‌నాయక్, వైస్ ఛైర్‌పర్సన్‌గా శీలం కోటేశ్వరి ఎన్నికయ్యారు. మధిరలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికకు హాజరు కాగా కొత్తగూడెంలో ఎంపి రఘురాం రెడ్డి, శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, వైరాలో శాసన సభ్యులు రాందాస్ నాయక్, సత్తుపల్లిలో శాసన సభ్యురాలు మట్టా రాగమయి లు హాజరయ్యారు.

# రాష్ట్ర స్థాయి శిక్షణలో పాల్గొన్న సర్పంచ్‌లు

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** రాష్ట్ర స్థాయి శిక్షణకు రఘునాథపాలెం మండలంకు చెందిన ఇద్దరు మహిళా సర్పంచ్‌లు హాజరయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని రాజేంద్ర నగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ భవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమంలో మండల పరిధిలోని చింతగుర్తి సర్పంచ్ తమ్మిని ప్రియాంక, జికె బంజర సర్పంచ్ బానోత్ జ్యోతి లు పాల్గొన్నారు. స్థానిక పాలనలో మహిళా సాధికారత అనే అంశంపై ఈ శిక్షణా కార్యక్రమం జరుగుతుంది. ఈనెల 20 వరకు సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వనున్నారు. మండలం నుంచి ఇరువురు మహిళా సర్పంచ్‌లు రాష్ట్ర స్థాయి శిక్షణకు హాజరుకావడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# కొలువుదీరిన ఏదులాపురం కొత్త పాలకవర్గం

- చైర్‌పర్సన్‌గా పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్‌గా తమ్మినేని నవీన్
- ఎన్నికకు మద్దతు ప్రకటించిన సిపిఐ కౌన్సిలర్లు








**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ నూతన పాలకవర్గం సోమవారం కొలువు తీరింది. మండల పరిషత్ కారాృలయంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి 32మంది కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేపించారు. చైర్ పర్సన్గా పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్గా తమ్మినేని నవీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు సిపిఐ కౌన్సిలర్లు మద్దతు తెలపగా..బిఆర్ఎస్, సిపిఎం కౌన్సిలర్లు బైకట్ చేసి వెళ్లిపోయారు. కౌన్సిలర్ల ప్రమాణ స్వీకరం నేపథ్యంలో మండల పరిషత్ వద్ద కోలహల వాతావరణం నెలకొంది. తమ పార్టీ కౌన్సిలర్ల కోసం ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు తరలివచ్చారు.

**సిపిఐ కౌన్సిలర్ల మద్దతు...**

రాష్ట్ర స్థాయిలో సిపిఐకాంగ్రెస్ పార్టీకి ఉన్న మైత్రి మేరకు జిల్లా పార్టీ ఆదేశాలతో సిపిఐ కౌన్సిలర్లు దండి రంగారావు, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి శ్రీజ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికకు మద్దతు తెలిపారు. అనంతరం వారిరువురికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కాంగ్రెస్ కౌన్సిలర్లకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పుష్పగుచ్చాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సోమవారం కొలువైన నూతన మున్సిపల్ పాలకవర్గానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ మహమ్మద్ రెహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత, కౌన్సిలర్లకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన పాలకవర్గానికి తమ సహాయ, సహకారాలు పూర్తిగా ఉంటాయని, ప్రజలకు నీతివంతమైన పాలన అందించి, సత్తుపల్లి మున్సిపాలిటీకి రాష్ట్రంలోనే మంచి పేరు తేవాలన్నారు.

# బిఆర్ఎస్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి ఎన్నికైన ఆరుగురు కౌన్సిలర్లు అధికారికంగా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో కూసంపూడి మహేష్, వీరపనేని రాధికాబాబి, కొత్తూరు తులసి ఉమామహేశ్వరరావు, బెల్లంకొండ రాము, జొన్నలగడ్డ లత, జాన్ మహ్మద్ మీర్జాలు ఉన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. తమను నమ్మి ఓటు వేసిన ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ఎలాంటి సమస్య ఎదురైనా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు.

# దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

-ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వైరా మండలం గన్నవరం గ్రామానికి చెందిన కిన్నెర రాణి తనకు ఇందిరమ్మ ఇంటికి సంబంధించి మొదటి విడత డబ్బులు జమ అయ్యాయని తదుపరి విడతలో డబ్బు జమ కాలేదని త్వరగా ఇప్పించాలని దరఖాస్తు చేశారు. రఘునాథపాలెం మండలం మంచుకొండ, కోయచలక గ్రామాల రైతులు తమకు మంచుకొండ, కోయచలక రెవెన్యూ శివాయిగూడెం పరిధిలో గల సర్వే నెంబర్లు 174, 175, 362, 364/92లలో గల సొంత వ్యవసాయ భూములకు వైకుంఠ ధామం, డంపింగ్ యార్డులకు వెళ్లే దారిని అట్టి భూమితో సంబంధం లేని వ్యక్తులు నిరోధిస్తున్నట్లు తమకు న్యాయం చేయాలని దరఖాస్తు చేశారు. కొణిజర్లకు చెందిన సయ్యద్ లాల్‌బీ గుండ్రాతిమడుగు రెవెన్యూ గ్రామంలో సర్వే నెం. 421/1/లూ లో రెండు ఎకరాల భూమి తన పేరున ఉన్నట్లు అందులో ఒక ఎకరం తన పెద్ద కూతురుకు బహుమానంగా రిజిస్ట్రేషన్ చేయించానని మిగిలిన ఎకరం భూమి తన చిన్న కూతురుకు బహుమానంగా రిజిస్ట్రేషన్ చేయాలని దానికి సంబంధించి మీ సేవలో అట్టి భూమి అసైన్డ్ భూమిగా చూపిస్తుందని దానిని తొలగించాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరం గోపాలపురంకు చెందిన ఎస్‌కె రజియా తనకు ఇల్లు లేదని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. సంబంధిత దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈవో దీక్షారైనా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బేతుపల్లి కాలువ పరిశీలన



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిదిలోని బేతుపల్లి పంట కాలువలో షీల్ట్ , పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో నీరు దిగువకు పారక పొలాల్లో నిలిచిపోతుందని రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన బేతుపల్లి సర్పంచ్ దొడ్డా రాజేంద్రప్రసాద్ (అమ్ములు), ఐబీ జేఈ మల్లికార్జున్ తో కలిసి సోమవారం కాలువను పరిశీలించారు. షీల్ట్ తొలగించి కాలువను శుభ్రం చేసి నీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకుంటామని, పంటలకు నష్టం లేకుండా చూస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. రైతులతో మాట్లాడి త్వరితగతిన పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

# క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

**-డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**
**-హోరాహోరీగా కబడ్డీ పోటీలు**





**ప్రజాపక్షం/చింతకాని :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.నేరడ గ్రామంలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో మహా శివరాత్రి సందర్భంగా గత 44 సంవత్సరాలుగా ఏర్పాటు చేస్తున్న కబడ్డీ పోటీలను డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆదివారం ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ క్రీడలు అంతరించిపోకుండా ఎంతో వ్య య ప్రయాసలకోర్చి నేతాజీ యువజన సంఘం క్రమం తప్పకుండా కబడ్డీ పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తుందన్నారు. అంతకు ముందు నేరడ శివాలయంలో భట్టి విక్రమార్క దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు నేరడ సర్పంచ్ దూసరి నేతాజీ, మాజీ ఖమ్మం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్, సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోటకూరి ప్రగతి, నేతాజీ యువజన సంఘం వ్యవస్థాపకులు దూసరి శ్రీరాములు క్రీడాకారులు పాల్గొన్నారు.

# మధిర మున్సిపల్ పీఠం హస్తం కైవసం

**- చైర్‌పర్సన్‌గా సామినేని సుజాత, వైస్ చైర్మన్‌గా కోన ధనికుమార్ ఎన్నిక**
**- హాజరైన డిప్యూటీ సిఎం భట్టి.. ఎక్స్ అఫీషియో ఓటు వినియోగం**





**ప్రజాపక్షం/ మధిర టౌన్ :** మధిర మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. పట్టణ ప్రథమ పౌరురాలిగా సామినేని సుజాత, వైస్ చైర్మన్‌గా కోన ధనికుమార్ ఎన్నికయ్యారు. సోమవారం మధిర ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పాల్గొని తన ఎక్స్ అఫీషియో ఓటును వినియోగించుకున్నారు. ముందుగా మధిరలోని తన క్యాంపు కార్యాలయంలో నూతనంగా గెలిచిన కాంగ్రెస్ కౌన్సిలర్లను డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సాదరంగా ఆహ్వానించారు. భారీ మెజారిటీతో విజయం సాధించినందుకు వారిని అభినందించిన ఆయన ప్రజల నమ్మకాన్ని నెలబెట్టుకుంటూ పట్టణ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం క్యాంపు కార్యాలయం నుంచి కౌన్సిలర్లతో కలిసి ఎంపిడిఓ కార్యాలానికి చేరుకున్నారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో నూతన కౌన్సిలర్లు ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం జరిగిన ప్రక్రియలో భట్టివిక్రమార్క తన ఎక్స్ అఫీషియో ఓటును వేశారు. మెజారిటీ



సభ్యుల మద్దతుతో చైర్‌పర్సన్ పదవికి సామినేని సుజాత, వైస్ చైర్మన్ పదవిని కోన ధనికుమార్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నవీన్‌బాబు అధికారికంగా ప్రకటించారు.

**అభివృద్ధికి బాటలు వేస్తాం: భట్టి**

ఎన్నిక అనంతరం భట్టివిక్రమార్క మాట్లాడుతూ మధిర మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా చూస్తామని, ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేయాలని కౌన్సిలర్లకు సూచించారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

## బావిలో పడి వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం గ్రామశివారు మామిడి తోటలో కోడి పందాలు నిర్వహిస్తున్నారని విశ్వసనీయం సమాచారం మేరకు స్థానిక ఎస్సై రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం రాత్రి దాడి చేయగా కోడి పందాలకు వచ్చిన వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన సంఘటన జరిగింది. ఎస్సై రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జమలాపురం గ్రామానికి సమీపంలో కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం తెలియడంతో తమ సిబ్బందితో కలిసి స్థావరానికి వెళ్లడంతో చాలా మంది జూదగాళ్లు పారిపోయారని తెలిపారు. అదే సమయంలో మైలవరం మండలం గుర్రాజుపాలెం గ్రామానికి చెందిన సుంకర కృష్ణారావు(29) అనే వ్యక్తి చీకట్లో పారిపోతూ నేల బావిలో పడిపోవడం జరిగిందని, అతనికి ఈత రాకపోవడంతో మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుడు కృష్ణారావు, భార్య లీలాభవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఒక కుమార్తె ఉన్నది.

## మండల వ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల వ్యాప్తంగా అన్ని శివాలాయాలలో ఆదివారం మహాశివరాత్రి వేడుకలను ఆయా గ్రామాల ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జమలాపురం సదాశివుని గుట్ట పైన శివాలయంలో తెల్లవారుజాము నుండే ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. జమలాపురం గ్రామానికి చెందిన స్వర్గీయ వీరమాచినేని రామచంద్రరావు కుమారులు జగదీష్, చంద్రబాబు, వెంకటకృష్ణారావుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన స్వామి వారి శివ కళ్యాణ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వారి ఆధ్వర్యంలో శివ కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కేఎన్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు, సర్పంచ్ నిర్మల కుమారి దంపతులు సదాశివుని గుట్ట వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం కళ్యాణానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కోటేశ్వరరావు దంపతులు ప్రారంభించారు. అదేవిధంగా దుర్గా మల్లేశ్వరి స్వామి వారి ఆలయంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహించి శివ కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎర్రుపాలెం, రేమిడిచర్ల, వెంకటాపురం గ్రామాల్లో శివాలయాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో అన్నదానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వైరా మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా డాక్టర్ చంద్రకళ

**వైస్ చైర్మన్‌గా కట్ల సంతోష్**





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సోమవారం నిర్వహించారు. మున్సిపాల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారిగా ఖమ్మం ఆర్‌డివో గరిడి నరసరావు ఎన్నికలు నిర్వహించారు. తొలుత కౌన్సిలర్ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం 12.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో ఆరో వార్డు కౌన్సిలర్ డాక్టర్ కాపా చంద్రకళకి 14 ఓట్లు రావడంతో చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా 9వ వార్డు కౌన్సిలర్ కట్ల సంతోష్‌కు కూడా 14 ఓట్లు రావడంతో వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ ఇద్దరికి ఎన్నికల నియామక పత్రాలను ఆర్‌డివో గరిడి నర్సింహారావు అందజేశారు.

## శివరాత్రి వేడుకల్లో అలరించిన కూచిపూడి సాంస్కృతిక కార్యక్రమాలు



**ప్రజాపక్షం/ మధిర టౌన్ :** మధిర పట్టణంలోని శ్రీ మృత్యుంజయస్వామి వారి దేవాలయ ప్రాంగణంలో జరుగుతున్న శివరాత్రి వేడుకల్లో ఆదివారం సాయంత్రం మధిర పట్టణానికి చెందిన కళాసాధన నృత్య కళానికేతన్ నిర్వాహకులు కళ్యాణపు నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమాలను చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చిన్నారులు పౌర్ణమి జ్యోతులు, శివస్తోత్రాలు, శివపార్వతుల కైలాస నృత్యాలు వంటి ప్రత్యేక గీతాలకు నృత్యాలతో వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. అనంతరం చిన్నారులకు మధిర పట్టణానికి చెందిన రిషిత మొబైల్స్ షోరూం అధినేత గోపికృష్ణ సహకారంతో ప్రత్యేక బహుమతులను ఆలయ అధికారుల చేతుల మీదుగా పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో కళా సాధన నృత్య కళానికేతన్ కూచిపూడి నృత్య గురువులు మహేశ్వరి, ఇన్‌చార్జి సింధు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బొమ్మగాని ధర్మభిక్షం జయంతి



**ప్రజాపక్షం/చింతకాని :** ప్రముఖ కమ్యునిస్టు నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం 104వ జయంతి వేడుకలు నేరడ గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నేరడ సర్పంచ్ దూసరి నేతాజీ మట్లాడుతూ నల్గొండ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 10వ, 11వ లోక్ సభ సభ్యులుగా ధర్మభిక్షం పనిచేశారన్నారు. నేటి యువత ధర్మభిక్షం ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు దూసరి శ్రీరాములు, పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, నేరడ ఉపసర్పంచ్ కోట బాలయేసు, నాయకులు చెవుల తిరపతిరావు, మట్టా రవి, మట్టా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు సన్మానం



**ప్రజాపక్షం/చింతకాని :** మహాశివరాత్రి సర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో శివపార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు ఉన్నత చదువుల చదివి ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారిని గ్రామ సర్పంచ్ ఆవుల నర్సింహారావు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ చంద్రకాని నర్సింహారావు, సిపిఐ నాయకులు రాసాల మోహన్‌రావు, మార్గం శ్రీను, బద్దల నర్సింహారావు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ అశ్విని ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా జలుబు, దగ్గు, జ్వరం, తలనొప్పి వంటి వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారందరిని పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని, ఇంటర్, పదవతరగతి విద్యార్థులకు రానున్న పబ్లిక్ పరీక్షల దృష్ట్యా స్ట్రెస్ మేనేజ్మెంట్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఇఓ భాస్కర్‌రావు, సూపర్‌వైజర్ వేణుగోపాల్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నాగసత్యవతి, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి, ఎఎన్ఎం స్నేహ, వసంత, ఆశా కార్యకర్త హేమలత పాల్గొన్నారు.

## పేట మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌గా జూపల్లి దంపతులు




**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** అశ్వారావుపేట నూతనంగా ఏర్పడ్డ మున్సిపాలిటీకి మొట్ట మొదటిసారిగా జూపల్లి దంపతులు చైర్మన్, వైస్‌చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. వీరితో పాటు మిగిలిన 20మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అశ్వారావుపేట నూతనంగా ఏర్పడడం మున్సిపాలిటీకి మొట్టమొదటి చైర్‌పర్సన్‌గా పొంగులేటి ముఖ్య అనుచరులు జూపల్లి రమేష్ సతీమణి జూపల్లి శశికళ ప్రమాణ స్వీకారం చేశారు. జూపలి రమేష్ వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ 30 ఏళ్ల తన రాజకీయ ప్రస్థానంలో పట్టణ ప్రజలు తమను గుర్తించి పార్టీలకతీతంగా పట్టం కట్టారని, పట్టణ వాసులకు రుణపడి ఉంటానికి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లవేళలా పట్టణంతో పాటు మండలంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉండి సేవ చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన జూపలి దంపతులను పలువురు అభినందనలు తెలిపారు.

## గ్రామాభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గ్రామాభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని అమ్మగూడెం "పంచాయతీ సర్పంచ్ పొట్ట లక్ష్మి సూచించారు. మండలం లోని అమ్మగూడెం లో సోమవారం సీసీ రోడ్ల నిర్మాణాకి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాభివృద్ధి కోసం పాలక వర్గం శక్తి వంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. దీనికి తోడు అధికారులతో పాటు రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. పంచాయతీ ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ను రూపొందించనున్నట్లు తెలిపారు. మండలం లో అమ్మగూడెం ను ఆదర్శ పంచాయతీ గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పంచాయతీ అభివృద్ధి కి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేణు, వార్డు సభ్యులు భవాని, కళ్యాణి, గ్రామ పెద్దలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, సత్యం, అడపాలరవీందర్, సురేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## సీహెచ్‌సిలో కాయకల్ప బృందం క్షేత్రస్థాయి పరిశీలన



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను సోమవారం కాయకల్ప బృందం పరిశీలించింది. కాయకల్ప ఇంటర్నల్ అసిస్టెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావు బృందం ఆకస్మికంగా పరిశీలించింది. హస్పిటల్ లోని పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న ఆహారం నాణ్యతను పరిశీలించారు. రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. మందుల పంపిణీ ఎన్ని రకాల మందులు ఉన్నాయి. ఎంత మందికి అందిస్తున్నారు. ప్రతీ రోజు ఓపీ ఎంతతంటుంది. వారికి అందుతున్నసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. హస్పిటల్ లో పారిశుద్ధం ను పరిసరాలు తిరిగి పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. కాయకల్ప కు అవసరమైన సౌకర్యాలు గురించి చర్చించారు. వైద్య సేవల పట్ల సంతృప్తిని వ్యక్తం చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మంగళ, డాక్టర్.కె.రాజేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడే విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

**ప్రజాపక్షం/పాల్వంచ :** ములకలపల్లి, పాల్వంచ మండలాల విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను పాల్వంచ సబ్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేశామని ఏడిఈ రహీముల్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు పరిషాకర వేదికకు హాజరై తమ విద్యుత్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ బిల్లులు సంభందిత తదితర సమస్యలు వినియోగదారుల ఫోరం చైర్మన్ సమక్షంలో పరిష్కారం పొందాలని కోరారు.

# కలిసి కట్టుగా ముందుకు సాగుతాం

**- కార్పోరేషన్ అభివృద్ధే ధ్యేయం**
**- నూతన పాలక వర్గానికి అభినందనలు**
**- ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు**




**ప్రజాపక్షం/కొత్తగూడెం :** కార్పోరేషన్ అభివృద్ధే ధ్యేయంగా సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు కలిసికట్టుగా ముందుకు సాగుతాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు తెలిపారు. కార్పోరేటర్ల ప్రమాణ స్వీకారం, మేయర్,డిప్యూటీ మేయర్ ఎకగ్రీవ ఎన్నిక అనంతరం ఆయన మాట్లాడారు. కొత్తగూడెం, పాల్వంచ, సుజాత నగర్‌లోని కొంత ప్రాంతం కలుపుకుని కార్పోరేషన్‌గా ఏర్పడిందని, ఆ కార్పోరేషన్‌కు ఈనెల 11న ఎన్నికలు జరగగా, 13న ఫలితాలు వెలువడ్డాయని చెప్పారు. చిన్నచిన్న బేధాభిప్రాయాల కారణంగా సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు విడివిడిగా స్నేహపూర్వక పోటీలో భాగంగా 60 డివిజన్ల వ్యాప్తంగా ఎన్నికల్లోకి వెళ్లినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో సిపిఐ 22 డివిజన్ల వ్యాప్తంగా విజయం సాధిచడంతో పాటు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించిన స్వతంత్ర కార్పోరేటర్‌తో కలిసి మొత్తం 23 సీట్లు సాధించామన్నారు. సిపిఐకి చెందిన మూడ్ గణేష్ మేయర్‌గా, కాంగ్రెస్‌కు చెందిన సిరిపురపు లలిత కుమారి డిప్యుటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. నూతనంగా ఏర్పడిన కార్పోరేషన్ ఎంతో అభివృద్ధి చెందనుందని హైదరాబాద్ తర్వాత అంతటి విశిష్టక ఇక్కడ ఉందని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి మరింతగా జరుగుతుందని, పెద్దపెద్ద కంపెనీలు ఇక్కడికి రావడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో గణనీయ మైన మార్పులు చోటు చేసుకుంటాయని, త్వరలో విమానాశ్రయంతో పాటు, పెద్దపెద్ద పరిశ్రమలు రానున్నాయని చెప్పారు. రాగద్వేషాలకు, పార్టీలు,వ్యక్తులు, శక్తులకు అతీతంగా అభివృద్ధే ధ్యేయంగా పాటుప డతామని, సానుకూల దృక్పదంతో ముందుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలపడంతో పాటు ప్రమాణ స్వీకారం చేసిన పాలక మం డలికి, మేయర్, డిప్యూటీ మేయర్లకు అభినందనలు తెలిపారు. సుపరి పాలన దిశగాముందుకు సాగాలని, కార్పోరేషన్ అభివృద్ధి కోసం పాటు పడుతూ చక్కటి పాలనను అందించాలని కూనంనేని సూచించారు.

# కాంగ్రెస్ పార్టీ విధేయుడికి పట్టం

**మున్సిపల్ వైస్ చైర్మన్‌గా సంతోష్**





**ప్రజాపక్షం/వైరా :** కాంగ్రెస్ పార్టీ విధేయుడికి పట్టం కట్టింది. గత 30 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ గల కార్యకర్తల నుండి నాయకుడు వరకు ఎదిగిన కట్ల సంతోష్‌కు కాంగ్రెస్ అధిష్టానం పట్టం కట్టింది. వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా కట్ల సంతోష్‌ను ఎంపిక చేసింది. స్వర్గీయ కట్ల సంజీవరావు, పద్మావతి దంపతులకు ఇద్దరు పిల్లలు కట్ల సంతోష్ , కట్ల కల్పన. కట్ల కుటుంబం అంటేనే కాంగ్రెస్ కుటుంబం. అలాంటి కుటుంబం నుంచి మరో మైలురాయి దాటి ప్రజాసేవకు సేవ చేసేందుకు ముందుకు వచ్చిన యువ నాయకుడు 9వ వార్డు కౌన్సిలర్ కట్ల సంతోష్ . విద్యావంతుడు ప్రజా సమస్యల పట్ల లౌక్యం కలిగిన వ్యక్తి కట్ల సంతోష్‌కు వైస్ చైర్మన్ పదవి ఇవ్వడం పట్ల రాజకీయాలకు అతీతంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కట్ల సంతోష్ తల్లి స్వర్గీయ కట్ల పద్మావతి రెండుసార్లు సోమవరం గ్రామపంచాయతీ ఉన్నప్పుడు వార్డు సభ్యురాలుగా పనిచేశారు. తర్వాత కంట్ల సంతోష్ భార్య కల్పన వార్డు మెంబర్‌గా పనిచేశారు. తల్లిదండ్రుల మార్గంలో కాంగ్రెస్ పార్టీకి సైనికుల్లా పనిచేస్తున్న కట్ల సంతోష్ పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు మార్గంలో ఆయన బాటలోనే నడుస్తూ పార్టీ విధేయుడిగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఒకప్పుడు ఉన్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి కట్ల కుటుంబానికి అత్యంత సన్నిహితుడు విడదీయలేని బంధం వాళ్లది. అయినా కూడా పొంగులేటి సుధాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బిజెపిలోకి వెళుతున్న సమయంలో కట్ల రంగారావు కట్ల సంతోష్, కట్ల నాగరాజుతో పిలిచి పార్టీ మారాలి అని చెప్పినప్పుడు వారి నోటి నుంచి వచ్చిన మాట ఒకటే అదే కాంగ్రెస్ పార్టీ అని తేల్చి చెప్పారు. మాకు రాజకీయంగా ఎలాంటి పదవులు ఉన్న లేకపోయినా కాంగ్రెస్ పార్టీని వీడి బయటకు వచ్చేది లేదని చెప్పిన కుటుంబం కట్ల కుటుంబం, మారిన రాజకీయ పరిణామాల్లో ఇటీవల కాలంలో కట్ల సంతోష్‌ను పార్టీ మారవని ఒత్తిడి వచ్చినప్పికీ ఆ ఒత్తిడిని సున్నితంగా తిరస్కరించి ఒకటే మాట ఒకటే బాట మా కుటుంబం కాంగ్రెస్ పార్టీ కుటుంబం అని తేల్చి చెప్పిన నాయకుడు యువ నాయకుడు కట్ల సంతోష్. వైరా మున్సిపాలిటీలో వైస్ చైర్మన్‌గా కాంగ్రెస్ యువ నాయకుడు కట్ల సంతోష్ పేరు ప్రకించడంతో ఒక్కసారిగా యువత పెద్ద ఎత్తున మున్సిపాలిటీ వద్దకు చేరుకొని సంతోష్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు పోటీపడ్డారు. ఏది ఏమైనప్పటికీ కాంగ్రెస్ పార్టీకి, విధేయుడికి పట్టం కట్టిందని చెప్పవచ్చును. కట్ల సంతోష్‌కు కల్పనతో వివాహమైన తర్వాత కూడా భర్త అడుగుజాడల్లోనే పార్టీ నిర్ణయానికి శిరోధార్యం అని ప్రోత్సహించింది. సంతోష్‌కు కూతురు వేదిత సైనా కుమారుడు సంజు పార్ధు ఉన్నారు. ఇటీవల వెలువడిన మున్సిపాల్ ఫలితాల్లో కూతురు కొడుకును చూసి చిన్నతంలోనే పార్టీ విధేతయను చూసిన సంతోష్ ఆనందానికి హద్దులు లేవు. ఎందుకంటే నా పిల్లలు కూడా నాతో పాటు చిన్న వయసులోనే కాంగ్రెస్ వైపు ప్రేమ చూపెట్టడం ఎంతో సంతోషగా ఉందని తెలిపారు.

# దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

**-ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యత**
**-దివ్యాంగ విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పట్టుదలతో ముందడుగు వేసి దివ్యాంగ విద్యార్థులు అన్ని క్రీడా విభాగాల్లో రాణించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. దివ్యాంగ విద్యార్థుల రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో పాల్గొనేందుకు ఖమ్మం జిల్లా నుండి వివిధ క్రీడా విభాగాల్లో ఎంపికైన దివ్యాంగ విద్యార్థుల బృందానికి సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి అభినందించారు. వారు వెళ్తున్న బస్సుకు జెండా ఊపి అదనపు కలెక్టర్ డా।। పి.శ్రీజతో కలిసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపడానికి క్రీడా పోటీలు దోహదపడతాయన్నారు. ఎందులోనూ తక్కువ కాదని అన్ని రకాల ఆటల పోటీల్లో పాల్గొంటుండాలన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి దివ్యాంగ చిన్నారుల ఆటల పోటీలకు అండర్ 14, 16 విభాగాల్లో 20 మంది వివిధ పోటీలకు హాజరవుతున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో మానసిక వైకల్యం, అంధత్వం, బధిరత్వం, శారీరక అంగవైకల్యం మొదలగు కేటగిరీలలో పోటీలు క్రీడా పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ బాజోజు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో 20 మంది దివ్యాంగ చిన్నారుల బృందానికి సహాయకులుగా ఐదుగురు ఐఆర్‌పిలు, ఇద్దరు స్పెషల్ ఎడ్యుకేటర్లు, ఇద్దరు కేర్ గీవర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు వెళ్తున్నారని తెలిపారు. క్రీడా పోటీల్లో పతకాలు సాధించి ఖమ్మం జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈవో దీక్షారైనా, ఇంచార్జి డిఈవో శ్రీనివాసరావు, ఎఎస్పి భానుప్రకాష్, డిఎస్‌వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం కార్పొరేటర్లుగా ప్రమాణం చేస్తున్న సిపిఐ సభ్యులు




# ఏదులాపురం, వైరాలో మున్సిపల్ కౌన్సిలర్లుగా ప్రమాణం చేస్తున్న సిపిఐ సభ్యులు



# ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు మెరుగుపర్చాలి

**-వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా కార్యాచరణ**
**-రబీ ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలి**
**-అధికారులతో సమీక్షించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా వసతులు మెరుగుపర్చాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజలకు అందించే వైద్య సేవలు, రబీ ధాన్యం సేకరణ, వేసవిలో త్రాగునీటి చర్యలు, రోడ్డు సేఫ్టీ పనుల పురోగతి, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు, జిల్లా అధికారుల హాజర్లపై అదనపు కలెక్టర్ డా।। పి. శ్రీజతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. సిబ్బంది, వైద్యులు అందుబాటులో ఉండాలని, గైర్హాజరు, విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్నారు. గ్రామాల్లో గ్రామ పంచాయతీలకు భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈజిఎస్‌లో భవనాల నిర్మాణం చేపట్టవచ్చునని ఈ దిశగా మంజూరు పొందెందుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా కార్యాచరణ చేయాలన్నారు. హ్యాండ్ పంపుల మరమ్మతులు, నీటి వనరుల గుర్తింపు పూర్తి చేయాలన్నారు. రబీ సీజన్ దిగుబడి అంచనాలకు తగినట్లు కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని తగు చర్యలు చేపట్టాలన్నారు. మిల్లర్లకు కొనుగోలుపై ముందే అవగాహన కల్పించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో ప్రమాద ప్రాంతాల్లో రోడ్డు భద్రతా పనులు వేగవంతం చేయాలన్నారు. గుర్తించిన ప్రధాన 30 బ్లాక్ స్పాట్‌లలో స్పీడ్ కంట్రోల్‌కు రంబుల్ స్ట్రిప్స్ సైన్‌బోర్డ్స్ ఏర్పాటు చేయాలని, రోడ్లపై లైన్ మార్కింగ్ తదితర పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షలో జెడ్పి సిఈవో దీక్షారైనా, ఆర్అండ్‌బి ఎస్ఈ యాకోబ్, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ చందునాయక్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీలత, డిపివో రాంబాబు, మిషన్ భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పాలకవర్గంలో ఒకే ఒక్క పాత పాలకవర్గ కౌన్సిలర్

**-ప్రజల మన్ననలను పొందిన మాదినేని సునీత**
**-రెండోసారి కౌన్సిలర్‌గా ఎన్నిక**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ నూతన పాలకవర్గం సోమవారం ప్రమాణస్వీకారం చేసింది. గత పాలకవర్గంలో కౌన్సిలర్గా పనిచేసిన వారిలో ఒకే ఒక్క కౌన్సిలర్ మాదినేని సునీత మరల నూతన పాలకవర్గంలో కౌన్సిలర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. గత పాలకవర్గంలో ఐదో వార్డు కౌన్సిలర్‌గా ఉన్న మాదినేని సునీత, నూతన పాలకవర్గంలో 12వ వార్డు కౌన్సిలర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా సోమవారం వైరా మున్సిపాలిటీ వద్ద పలు పార్టీల నాయకులు మధ్య జరిగిన చర్చలో మాదినేని సునీత హాట్ టాపిక్‌గా చర్చ నడిచింది. ప్రజల మన్ననలను పొందింది. కాబట్టి ప్రజాక్షేత్రంలో మరల గెలుపొందడం జరిగింది. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పట్ల పరిష్కరించే అంతవరకు పోరాటం చేస్తూ ప్రతి సమస్యను తన సమస్యగా భావిస్తూ అందరికి అందుబాటులో ఉంటున్న మాదినేని సునీతకు ప్రజల్లో నేటికి మద్దతు తగ్గలేదని చెప్పవచ్చును అని పలువురు అన్నారు. సమస్య చెబితే వెంటనే స్పందించనున్న వ్యక్తి మాదినేని సునీత అని పలువురు తెలిపారు.

# శివనామస్మరణతో మారుమోగిన శైవక్షేత్రం

**- తొలిరోజు పోటెత్తిన జనం, రెండవరోజు తగ్గు ముఖం**
**- మామిడి చెట్టుకు రూ.వెయ్యి వసూళ్లు చేసిన యజమానాలు**
**- సంగమేశ్వరుని దర్శించుకున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్, విఐపీలు**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** మహాశివరాత్రిని పురస్కరించుకొని, ఖమ్మంరూరల్ మండలంలోని తీర్థాల సంగమేశ్వరుని సన్నిధిలో శనివారం అర్ధరాత్రి నుంచి జాతర అట్టహాసంగా ప్రారంభమైంది. ఐదురోజుల పాటు జరగనున్న జాతరలో ఆదివారం మొదటిరోజు భక్తులు పోటెత్తారు. ఈ నేపథ్యంలో ట్రాఫీక్ అంతరాయం ప్రజలను వేదించింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి కుటుంబ సమేతంగా సంగమేశ్వరుని దర్శించుకున్నారు. అలాగే పలువురు విఐపీలు దర్శనంచేసుకున్నారు. రెండవరోజు జనం తగ్గముఖం పట్టారు. ఈ సందర్భంగా సందట్లో సడేమియాల మామిడితోటల యజమానులు దోపిడీ పర్వానికి తెరలేపారు. భక్తుల నుంచి చెట్టుకు వెయ్యి రూపాయల చొప్పున వసూళ్లు చేశారు.

### వర్ణనాతీతంగా ప్రజల కష్టాలు...

జాతరలో ప్రజల కష్టాలు వర్ణాతీతంగా మారాయి. ఓ పక్క ఎండ..మరో పక్క ట్రాఫీక్ సమస్య అతలాకుతలం చేశాయి. అలాగే సంగమేశ్వరుని దర్శించుకునేందుకు, ఫ్రీ దర్శనంలో నిలుచున్న భక్తులు గంటల తరబడి క్యూలైన్లో నిలబడ్డారు. ఆలయ పరిశసర ప్రాంతాల్లో నిలువు నీడ లేక ఎండతాపంతో అల్లాడిపోయారు. దాతల దయతో తాగేందుకు మంచి నీరు దొరికి కొంత ఉపశమనం చెందారు. ట్రాఫీక్ సమస్య కాలినడక దారులతో పాటు వాహనదారులను వేధించింది. ఉదయం పూట హడావుడి చేసిన ట్రాఫీక్ పోలీసులు చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో రెండు నుంచి మూడు గంటలు పైనే గోళ్లపాడు, తీర్థాల రోడ్డులో వాహనాలు నిలిచిపోయాయి. కాలినడకను నడిచే పరిస్థితిలు కూడా లేకుండాపోయాయి. దశాబ్దాలుగా తీర్థాల జాతర జరుగుతున్నప్పటికీ కనీసం ఆలయ చుట్టూ పరిశసరాలలో చెట్లను నాటితే నీడనిచ్చేవి . కానీ ఎండోమెంట్ అధికారులు జాతర సమయంలో వచ్చే ఆదయంపై మాత్రమే ఫోకస్ చేస్తున్నట్లు భక్తులు పేర్కొంటున్నారు.

### చెట్టుకు రూ.వెయ్యి వసూళ్లు..

జాతరలో వేలంపాట ద్వారా షాపులు ఏర్పాటు చేసుకున్న వారికంటే, అక్కడి మామిడితోటల యజమానులకు మంచి లాభం వచ్చింది. చెట్టుకు రూ. వెయ్యి చొప్పున భక్తులకు కిరాయికి ఇచ్చారు. అలాగే ఇతర వాహనాలు పార్కింగ్ చేసుకుంటే ఇంత రుసుమని విధించుకొని తీసుకున్నారు. ఇలా ఒక్కరోజే లక్ష రూపాయలను గడించడం విశేషం. జాతర రెండవ రోజు ఈ వసూళ్ల పర్వం కొనసాగింది. ఈ విధానాన్ని భక్తులు వ్యతిరేకించినప్పటికీ, చేసేదిమిలేక అడిగినంత ఇచ్చి ఉన్నారు. ఈ సందర్భంగా మినరల్‌వాటర్ పేరిట జనరల్‌వాటర్‌ను విక్రయించి, ప్రజలను మోసం చేశారు. ఇలా భక్తులను పలు దుకాణాల సరుకుల అమ్మకంలో నిలువుదోపిడీ చేశారు.

# గెలిచిన అనుభవం.. ఆర్థిక పరాభవం

**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ ఎన్నికలో రాజకీయాలలో అధికారంతో సంభంధం లేకుండా ప్రజల మద్యనే ఉంటూ, నిత్యం అందుబాటులో ఉండే అపార అనుభవమే గెలిచింది. దీనితో ఆర్థిక అధికారానికి పరాభవం మిగిలిందని ప్రజలు గుసగుసలాడుకొంటున్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో సిపిఐ ఎక్కడున్నదంటూ విపరీత ధోరణితో మాట్లాడిన వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికలలో దూకుడు ప్రదర్శించిన సిపిఐ అదే ఊపుతో కొత్తగూడెం మునిపల్ కార్పోరేషన్ ఎన్నికలలో కొనసాగిస్తూ సత్తా చాటింది. అధికారపార్టీ కుటిల, కుయుక్తులను చిత్తుచేసింది. కాంగ్రెస్‌తో సమానంగా 22 సీట్లలో విజయం సాధించి అధినాయకుడికి ముచ్చెమటలను పట్టించినది. ఏదో అనుకున్న రెవిన్యూకు సిపిఐ క్షేత్రస్థాయిలో ఉన్నటువంటి పార్టీ శ్రేణులను గుర్తించలేక పోయి చతికిల పడ్డారు. ఆర్థిక పలుకుబడి, అధికార పలుకుబడిని ఉపయోగించుకొని సిపిఐని దెబ్బదీసేందుకు వేసిన ఎత్తుగడలు కొత్తగూడెంలో ఫలించలేదు. పైగా రాజకీయాలలో అధికారం ఉన్నా లేకపోయినా నిత్యం అప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాక్షేత్రంలో ఉండే కమ్యూనిస్టును ప్రజలు ఆదరించారు. అక్కున చేర్చుకొన్నారు. అసాధారణ విజయాన్ని కట్టబెట్టారు. కాంగ్రెస్ పార్టీ పన్నాగాలను పసిగట్టిన ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు ఆదేశాలతో జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్ పాషా నేతృత్వంలో పార్టీ క్యాడర్‌ను అప్రమత్తం చేశారు. కార్పోరేషన్ ఎన్నికల కదనరంగంలో అభ్యర్థుల విజయానికి పక్కా ప్రణాళికలు రచించారు. కాంగ్రెస్ కుట్రలను చిత్తు చేస్తూ ముందుకు సాగారు. క్షేత్రస్థాయిలో పునాదులు కలిగిన సిపిఐ అధికారి పార్టీ దూకుడును నిలువరించినది. ఎదో చేయాలనే అమాత్యుడికి పరాభవాన్ని మిగిలించారు. కొట్లాడి పోరాడిన సిపిఐకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పొత్తు ధర్మాన్ని విస్మరించిన కాంగ్రెస్‌కు ఓట్లతో గట్టి చెప్పారు. సర్పంచ్ ఎన్నికలలో చతికల పడిన బిఆర్ఎస్ కాంగ్రెస్ విపరీత పోకడలతో ఊపిరిలుదినట్లయింది. దీనితో ఆపార్టీ 8 సీట్లలో గెలుపును అందుకొన్నది. ఆరుగురు స్వతంత్రులు గెలిచారు. మేయర్ పదవిని దక్కించుకోవాలంటే 31 మంది సభ్యులు అవసరం ఉన్నది. దీనిలో ఎవరికి స్పష్టమైన మెజారిటీ లేకపోవటంతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ బేషరతుగా సిపిఐకి మద్దతు పలికారు. అయినా సిపిఐ నాయకత్వం పొత్తు ధర్మాన్ని పాటించినది. బిఆర్ఎస్ మద్దతును కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చ లు సాగించి మేయర్ పీఠంపై ఏర్పడిన సస్పెన్స్‌కు తెర తొలగించినది. మేయర్ స్థానంలో చెరి రెండున్నరేండ్లుగా ఒప్పందం చేసుకొన్నారు. రాజకీయాలలో అనుభవం ముందు ఆర్థిక పలుకుబడి చతికిల పడక తప్పదని ఎప్పుడు అర్థికంతో రాజకీయాలను చేయాలనుకుంటే ప్రజలు తిప్పికొడతారని కొత్తగూడెంమున్సిపల్‌కార్పోరేషన్‌ఎన్నికలలో తేటతెల్లమయింది.

# ఆశించిన ఫలితం రాలేదు..అధైర్యపడొద్దు : తాటి



**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు పార్టీ అభ్యర్థులకు తన పూర్తి మద్దతు ప్రకటించారు. ఎన్నికల్లో విజయం చేజారిన అభ్యర్థుల నివాసాలకు స్వయంగా వెళ్లి వారిని ఓదార్చారు. సోమవారం నియోజకవర్గంలోని పలువురు నాయకుల ఇళ్లను సందర్శించి వారితో చర్చించారు. ముఖ్యంగా జుజ్జురవు శ్రీరామ్మూర్తి తో పాటు నాయకులు యుఎస్ ప్రకాశ్, రఘురామ్ శెట్టిపల్లి గృహాలను సందర్శించి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఫలితం ఎలాఉన్నా, ప్రజా క్షేత్రంలో ఉంటూ కార్యకర్తలకు తోడుగా ఉండాలని ఈసందర్భంగా ఆయన సూచించారు. ఈ పర్యటనలో భాగంగా కౌన్సిలర్ అభ్యర్థులను వ్యక్తిగతంగా కలిసి వారిలో ధైర్యాన్ని నింపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ నిరాశ చెందవద్దని, తాము ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌చార్జి కట్రం స్వామిదొర, మాజ జెడ్పిటిసి మల్లికార్జున్‌రావు, యుఎస్ ప్రకాశ్, టిఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ సత్యవరపు సంపూర్ణ, ఏలేటి పార్వతి, శెట్టిపల్లి రఘురాం, ఎండి రెహానా బేగం, చిక్కం గోపికృష్ణ, వీర్రాజు, ఆరేపల్లి రాంబాబు, నీలం రత్నవేణి, నార్లపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మొక్క మీది....సంరక్షణ మాది...

**-ఆదర్శంగా వార్డు సభ్యురాలు శరీష పుట్టిన రోజు వేడుకలు**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని ఇరవెండి గ్రామ పంచాయితీలో పలువురికి ఆదర్శంగా ఉండే విధంగా ఓ మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం గ్రామ పంచాయితీ పరిధిలోని పల్లె ప్రకృతి వనంలో వార్డు సభ్యురాలు బత్తుల శిరీష పుట్టినరోజు వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు తన వంతు కృషిని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ గుండి బాబురావు, మహంకాళి రామారావులు పాల్గొని, శిరీషను అభినందించారు. ఈసందర్భంగా గ్రామ పంచాయితీ సెక్రటరీ స్పందన శరీషకు శాలువా వేసి, బొకేతో సత్కరించారు. అనంతరం సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ పుట్టిన రోజు, ప్రత్యేక సందర్భాల్లో కనీసం ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. మొక్కను మీరు నాటండి..దాని సంరక్షణ బాధ్యత మాది అంటూ గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. పల్లె ప్రకృతి వనం వంటి ప్రదేశాల్లో పుట్టినరోజులు జరుపుకోవడం ద్వారా పర్యావరణానికి మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పంచాయితీ వార్డు సభ్యులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సుశీల మరణం తీరని లోటు



**ప్రజాపక్షం/కారేపల్లి:** దుబ్బతండా గ్రామానికి చెందిన మాలోత్ సుశీల ఆదివారం హఠాత్తుగా మరణించారు. ఈ విషయం తెలిసిన వెంటనే సోమవారం దుబ్బతంగా గ్రామ పంచాయితీ సర్పంచ్ ఆంగోత్ మత్రు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా సర్పంచ్ ఆంగోత్ మత్రు మాట్లాడుతూ గ్రామ ప్రజల సంక్షేమం తన ప్రధాన కర్తవ్యం అని తెలిపారు. గ్రామంలో ఎవరికి అయినా ఇలాంటి కష్టకాలం వచ్చినప్పుడు గ్రామ పంచాయితీ తరపున తాను ముందుండి సహాయం చేస్తానని చెప్పారు. మాలోత్ సుశీల మరణం గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులకు, మనోధైర్యం కల్పిస్తూ, తన వంతు సహాయంగా రూ 5000లను అందజేసి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గ్రామ ప్రజల పట్ల ఆయన చూపుతున్న సేవాభావం, బాధ్యతాయుత వైఖరి అందిరికీ ఆదర్శంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయితీ నాయకులు హరి, రమేష్, చినేష్, పార్వతి, శ్రీను, శ్రీరాములు, సాములు, లచ్చిరం, విజయ్, సుశీల, రవి, బాబురావు, బిచ్చు, కోటేష్, భవుసింగ్, నందు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సేవాలాల్ జయంతి



**ప్రజాపక్షం/కారేపల్లి:** భాగ్యనగర్ తండా గ్రామంలో బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ధూప దీప నైవేధ్యలతో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. బంజారాల ఆరాధ్య దైవం అయిన సేవాలాల్ మహారాజ్ అహింసా వాది అని సేవాలాల్ మహారాజ్ దారిలో యువత నడవాలని కోరారు. ఈకార్యక్రమంలో బంజారా నాయకులు, మాజీ జెడ్పిటిసి జగన్ నాయక్, మాజీ సర్పంచ్ ఇస్లావత్ బన్సీలాల్, గుగులోత్ భగవాన్ దాస్, ఆలోత్ నందరాజ్, వార్డు సభ్యులు భూక్య కిషన్ నాయక్, గుగులోత్ నాగేశ్వరరావు, దేవి, మాజీ వార్డు సభ్యులు హనుమ, నాయకులు మత్రియా, లచ్చు, జిత్త, బన్సీలాల్, లావుడియా రాంబాబు, భూక్య రాంకిషోర్, గుగులోత్ కళ్యాణ్, భూక్య మోతిలాల్, పవన్, సురష్, రాజేష్, రాంజీ, వినోద్ నాయక్, ప్రవీణ్, శశిథర్, శ్రీనాధ్, సాయినాధ్, మురళి, వీరు, బాలు చౌహన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# సొంత ఖర్చులతో శ్రీ పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవానికి డెకరేషన్



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండల కేంద్రంలోని చౌటపల్లి గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీ చంద్రమౌళిశ్వర స్వామి వారి ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆకర్షనీయంగా కనపడేల బోడియా తండా సర్పంచ్ బోడ వీరు నాయక్, జ్యోతి దంపతులు తమ సొంత ఖర్చులతో శ్రీ పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవానికి, ఆలయం చుట్టూ పూలతో డెకరేషన్ చేయించారు. అలాగే కళ్యాణం జరుగు మండలం స్టేజిను కూడా పచ్చి పూలతో డెకరేషన్ చేయడం జరిగింది. అలాగే ఆ పరమేశ్వరుడి దర్శనర్థం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమానికి వంట సామాన్లు, టెంట్లు కూడా ఏర్పాటు చేశారు. వారికీ వారి కుటుంబ సభ్యులకు ఆ పరమేశ్వరుడి ఆశీస్సులు ఎల్ల వేళలా ఉండాలని కోరుకుంటూ, రాజకీయాల్లో ఇంకా ఉన్నంత స్థాయికి ఏదగాలని పలువురు కోరుకుంటున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు పోలోజు నరేంద్ర చారి, గ్రామ సర్పంచ్ మక్కా రామకృష్ణ, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం.. ప్రజల అచంచల విశ్వాసం

**- మున్సిపల్ పోరులో కాంగ్రెస్ క్లీన్ స్వీప్**
**- విలేకరుల సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి వెల్లడి**



**ప్రజాపక్షం/మధిర :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు ఉంచిన నమ్మకమే ఈ మున్సిపల్ ఎన్నికల విజయమని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. సోమవారం మధిరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ కేవలం గ్రామీణ పార్టీయేనని బురద చల్లిన వారికి ఈ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 90 నుంచి 95 మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం చారిత్రాత్మక విజయమని కొనియాడారు. అసెంబ్లీ, పార్లమెంట్, పంచాయతీ ఎన్నికల తరహాలోనే మున్సిపల్ ఎన్నికల్లోనూ ఓటర్లు భారీ మెజారిటీని కట్టబెట్టారని, విజయం అందించిన ప్రతి ఓటరుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం ప్రజలు ప్రభుత్వంపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమన్నారు. గడిచిన రెండు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర మంత్రి మండలి సమిష్టిగా పనిచేస్తూ అటు అభివృద్ధిని, ఇటు సంక్షేమాన్ని సమతూకంతో ముందుకు తీసుకెళ్లి అర్బన్ సెంటర్లను అభివృద్ధి బాట పట్టించారని భట్టి పేర్కొన్నారు.

**2047 విజన్.. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ..**

తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదిగేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. మా పోటీ దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాదు ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతోనే 2047 విజన్ డ్యాకుమెంట్ ద్వారా తెలంగాణ గ్లోబల్ హబ్‌గా మారుస్తాం అని ధీమా వ్యక్తం చేశారు.

**ఉద్యోగాల కల్పన లక్ష్యం...**

పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక సదుపాయల కల్పతో పాటు పారిశ్రామికీకరణ ద్వారా భారీగా ఉద్యోగ అవకాశాలు సృష్టించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన వివరించారు. విస్తరిస్తున్న పట్టణాలను అభివృద్ధి చేయడానికి మున్సిపల్ శాఖ బాధ్యతలను స్వయంగా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్యూర్ క్యూర్ రేర్ నినాదంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. మున్సిపల్ పరిపాలనలో జవాబుదారీతనం పెంచడానికి, పౌరులకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ప్యూర్ క్యూర్ రేర్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత వేగతంగా ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరారవు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోన ధనికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# కోమటిపల్లి నుంచి నగర మేయర్‌గా..

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సుజాతనగర్ మండలంలోని అతిచిన్న పల్లెటూరు కోమటిపల్లి. కేవలం 420 ఓట్లు మాత్రమే కలిగిన చిన్న పల్లెటూరు. గిరిజన జనాభా ఎక్కువగా ఉండే ఈ పల్లె నుంచి ఓ యువకుడు రెండు లక్షల జనాభా కలిగిన ఓ నగరాన్ని ఏలేందుకు సిద్ధమయ్యాడు. ఈ ఘట్టం సోమవారం నాడు ఆవిష్కృతమైంది. ఇటీవల కార్పోరేషన్‌గా ఏర్పడిన కొత్తగూడెంలో కోమటిపల్లి అంతర్భాగమైంది. 20వ డివిజన్‌గా కోమటిపల్లితో పాటు సమీపంలోని ప్రాంతాలను కలిపి ఏర్పాటు చేశారు. గిరిజన వ్యవసాయ కుటుంబంలో జన్మించిన 34 ఏళ్ల మూడ్ గణేష్ కుటుంబం ఆది నుంచి కమ్యూనిస్టు పార్టీలో ఉండేది. ఆటో డ్రైవర్‌గా గణేష్ పనిచేస్తున్నప్పుడు సుజాతనగర్ మండల ఏఐటియుసి నాయకునిగా పనిచేశారు. 2019లో జరిగిన ఎంపిటిసి ఎన్నికల్లో ఎంపిటిసిగా ఎన్నికయ్యారు. ఇటీవల 20వ డివిజన్ నుంచి



సిపిఐ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. కాంగ్రెస్, సిపిఐ ఒప్పందంలో భాగంగా గిరిజనులకు రిజర్వ్ చేయబడిన కొత్తగూడెం మేయర్ స్థానాన్ని గణేష్ చేజిక్కించుకున్నాడు. కాంగ్రెస్ కమ్యూనిస్టుల మద్దతుతో ఆయన మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒక చిన్న పల్లెటూరు నుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన గణేష్ కొత్తగూడెం మేయర్‌గా ఎన్నికై నూతన చరిత్రకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు సహకారంతో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని ఈ విజయంలో పాలు పంచుకున్న కమ్యూనిస్టు పార్టీ శ్రేణులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఇచ్చిన ఈ అవకాశాన్ని కొత్తగూడెం కార్పోరేషన్ అభివృద్ధికి వినియోగిస్తానని ఆయన తెలిపారు.

# సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్‌గా రెహానా బేగం కమల్ పాషా







**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అంతా టెన్షన్ , టెన్షన్ చైర్మన్ ఎవరూ, వైస్ చైర్మన్ గా ఎవరు ఎంపికవుతారంటూ నియోజకవర్గంలోని ప్రజలంతా సత్తుపల్లి మున్సిపాలిటీ వైపు ఉత్కంఠగా ఎదురు చూశారు. ఎవరికి తోచిన విధంగా వారు చైర్మన్ అభ్యర్దిని వాళ్ళే నిర్ణయించినట్లు పేర్లు నిర్ణయించారు. ఇలా ఆయా సామాజిక వర్గాల వారు తమకే అదిష్టానం ఆశీస్సులు ఉన్నాయంటూ లెక్కలేసుకున్నారు. లోపల ఏం జరుగుతుంది ఎవరి పేరు వస్తుందోనని అందరూ ఉత్కంఠతతో సుమారు 4 గంటలు పాటు ఆతృతగా ఎదురు చూశారు. స్థానిక రాజకీయాల్లో అధికారం ఎలా నిశ్శబ్ద ఒప్పందాలు, సామాజిక సమీకరణాలు,చర్చల మధ్య నిర్ణయించబడుతుందో మరోసారి స్పష్టంగా చూపించింది. నాలుగు గంటల పాటు కొనసాగిన రహస్య సమావేశాల్లో, మీడియాకు నో ఎంట్రీ అనటంతో విలేకరులు మున్సిపాలిటీ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. స్పందించిన అధికారులు షరతులతో లోనికి అనుమతించటంతో మరో మారు విలేకరులు నిరసన వ్యక్తం చేస్తూ మున్సిపాలిటీ ఆవరణలో బైటాయించారు. నాయకులు సముదాయించి ఎన్నికకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇదంతా బయట నుండి గమనిస్తున్న వారికి ఏం జరుగుతుందో అర్థం కాక వాతావరణం పూర్తిగా రాజకీయ ఉత్కంఠతో నిండిపోయింది. చైర్మన్ ఎవరు? వైస్ చైర్మన్ ఎవరు? అనే ప్రశ్నలు స్థానిక ప్రజలతో పాటు పార్టీ శ్రేణుల్లోనూ హాట్ టాపిక్‌గా మారాయి. సామాజిక వర్గాల ఆధారంగా లెక్కలు వేసుకుంటూ, "మన వారికే ఈసారి అవకాశం" అంటూ ప్రచారాలు ఊపందుకున్నాయి. అయితే అంతా ఊహాగానాల మధ్యే తెర వెనుక చర్చలు సాగాయి. చివరకు రెహానా బేగం కమల్ పాషాను చైర్మన్‌గా, బొంతు సుమలతను వైస్ చైర్మన్‌గా ఖరారు చేస్తూ నిర్ణయం వెలువడింది. ఈ ప్రకటనతో నాలుగు గంటలుగా కొనసాగిన ఉత్కంఠకు ముగింపు పడినప్పటికీ,ఎంపిక విధానంపై ప్రశ్నలు మాత్రం అలాగే మిగిలాయి.ప్రత్యేకంగా చైర్మన్ పదవికి సంబంధించి మరో ఇద్దరి పేర్లు బలంగా వినిపించినా, చివరి క్షణాల్లో దిశ మారినట్లు సమాచారం. రాజకీయ ఒత్తిళ్లు, వర్గ సమీకరణాలు, పరస్పర ఒప్పందాలే ఈ మలుపుకు కారణమన్న చర్చ నడుస్తోంది. ఒక దశలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మంత్రి నారా లోకేష్ కూడా రాజకీయంగా పావులు కదిపినట్లు వార్తలు రావడం, ఈ స్థానిక పదవికి ఉన్న ప్రాధాన్యతను మరింత హైలైట్ చేసింది. బొంతు సుమలత బలమైన సామాజిక వర్గం నుంచి గెలుపొందిన నాయకురాలిగా గుర్తింపు పొందడంతో, మొదట చైర్మన్ పదవి ఆమెకే దక్కుతుందన్న అంచనాలు కూడా ఏర్పడ్డాయి. కానీ చివరి నిర్ణయం భిన్నంగా రావడం వెనుక రాజకీయ సమతుల్యతే కీలక పాత్ర పోషించిందన్న అభిప్రాయం వినిపిస్తోంది.మొత్తానికి సత్తుపల్లి మున్సిపాలిటీ పరిణామం , స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం ప్రజా ప్రతినిధుల ఎంపిక మాత్రమే కాకుండా, అధికార రాజకీయాల సూక్ష్మ వ్యూహాలకు అద్దంపడుతాయని మరోసారి నిరూపించింది.

# నూతన మున్సిపల్ పాలకవర్గాలకు మంత్రి తుమ్మల అభినందనలు

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల్లో సోమవారం ఎన్నికైన నూతన చైర్మన్‌లు, వైస్ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజ ల విశ్వాసాన్ని నిలబెట్టేలా పారదర్శక పాలన అందిస్తూ, పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. పట్టణాల్లో మౌలిక వసతుల విస్తరణ, పారిశుద్ధ్య వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తుమ్మల కోరారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. కోటి ఆశలతో ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతంగా పాలన సాగించాలని నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, పాలకవర్గ సభ్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

# కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్‌గా మోహన్ నాయక్

## వైస్ చైర్మన్‌గా శీలం కోటేశ్వరి





**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మున్సిపాలిటీ నూతన చైర్మన్‌గా హనుమ తండా =కు చెందిన ధరావత్ మోహన్ నాయక్ సోమవారం జరిగిన మున్సిపల్ సమావేశంలో జరిగిన ఎన్నికలలో ఆయన మెజార్టీ సభ్యులతో విజయం సాధించారు. అదేవిధంగా గోపాల దేవ బోయినపల్లి గ్రామానికి చెందిన శీలం కోటేశ్వరి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గా ఎన్నికయ్యారు. కౌన్సిలర్ల సమక్షంలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికయ్యారు అధికారికంగా ఎన్నికల అధికారి రాజేశ్వరి ప్రకటించారు. ఈ సందర్భంగా చైర్మన్ వైస్ చైర్మన్ లు మొదటిసారిగా మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తానని, మౌలిక వసతులు కల్పనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తానని తెలిపారు. తాగునీరు, పారిశుధ్యం, అంతర్గత రహదారుల అభివృద్ధి తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన వారిని శాలువాలతో సత్కరించారు. పట్టణ ప్రజలు వారిని హర్షిస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ రామ దుర్గా రెడ్డి, మేనేజర్ నాగేశ్వరరావు లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# సిఎస్ఐ చర్చి ప్రారంభం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల కేంద్రమైన రఘునాథపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సిఎస్ఐ సెయింట్ థామస్ చర్చిని డోర్నకల్ అధ్యక్ష, మండల పీఠాధిపతులు ది రైట్ రెవరెండ్ డా॥ కోడిరెక్కల పద్మరావు బిషప్ సోమవారం ప్రారంభించారు. చర్చి ప్రారంభోత్సవ సందర్భంగా సిఎస్ఐ సంఘం సభ్యులు గ్రామశివారు నుండి డోర్నకల్ బిషప్‌ను మేళతాళాలతో ఊరేగింపుతో ఘన స్వాగతం పలికి మందిరంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు ప్రేమ నిరంతరం ఉంటుందని ఈ మందిరం సమస్త జనులకు ప్రార్థన మందిరంగా ఉంటుందన్నారు. ప్రేమ మార్గమే ప్రపంచ దేశాలు శాంతియుతంగా, సామరస్యంగా వర్ధిల్లుతున్నాయన్నారు. ఈ మందిర నిర్మాణంలో భాగస్వాములైన కుటుంబాలను ప్రభువు ఎల్లవేళల కాపాడతారన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఐ చర్చి ఫాస్టర్ జయప్రతాప్, ఈర్జాల లలితరాజు, ఈర్జాల మురళీ, రెంటాల ప్రసాద్, ఈర్జాల కృష్ణ, ఈర్జాల అశోక్, అంథోటి శివకుమార్, కోట్టె నరేష్, జాకబ్ బుచ్చయ్య, శ్యాముల్, కుందాసాహెబ్, వివిధ సిఎస్ఐ సంఘ ఫాస్టర్లు, సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఈ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ కూటమి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం



**ప్రజాపక్షం/వైరా:** బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ కూటమి మున్సిపాలిటీ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ఉంటుందని సిపిఎం నాయకులు బొంతు రాంబాబు, బిఆర్ఎస్ నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావు, బాణాల వెంకటేశ్వర్లు, లకావత్ గిరిబాబు తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయం ముందు కూటమి కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం అనంతరం వారు మాట్లాడుఊత ప్రజా సమస్యల పరిష్కరించే వరకు పోరాటం చేస్తూ ఉంటామని, ప్రజల పక్షాన ఉంటామని, ప్రతి సమస్యను తీర్చే విధంగా కూటమి పోరాటం ఉంటుందని వారు అన్నారు. మున్సిపాల్ ఎన్నికల్లో ఆదరించి కౌన్సిలర్లు గెలిపించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలపడంతో పాటు వార్డు సమస్యలపై నిరంతరం కౌన్సిలర్లు అందుబాటులో ఉంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సురేష్, వార్డు కౌన్సిలర్‌లు కట్టా స్వరూపరాణి, తిరుపతి శివకుమారి, మాదినేని సునీత, చిలకా చిన్న కోటయ్య, దొంతబోయిన వెంకటేశ్వర్లు, కిన్నెర కృష్ణ, నల్లమోతు శైలజ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆశలు, ఆకాంక్షలకనుగుణంగా పనిచేస్తాం



**- ఎంఎల్ఏ కూనంనేని సహకారంతో అభివృద్ధి**
**- ఘన విజయాన్ని అందించిన ప్రజలకు ధన్యవాదాలు**
**- పార్టీ శ్రేణులు, అభిమానుల శ్రమ అభినందనీయం**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో సిపిఐకి ఘన విజయాన్ని అందించిన ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా మేయర్,కార్పోరేటర్ల పనితీరు ఉంటుందని, అందుకు అనుగుణంగా కమ్యూనిస్టు పార్టీ తన వంతు పాత్ర పోషిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా స్పష్టం చేశారు. సోమవారం జరిగిన కార్పోరేటర్ల ప్రమాణ స్వీకారం, మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక అనంతరం ఆయన మాట్లాడారు. స్థానిక ఎంఎల్ఏ కూనంనేని కృషితో, ప్రత్యేక శ్రద్ధతో కార్పోరేషన్‌ను సాధించుకున్నామని, కేంద్రం నుంచి రాష్ట్రం నుంచి అత్యధిక నిధులు రాబట్టి కార్పోరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి జరుగుతుందన్నారు. గెలుపు ఓటముల అంశాన్ని ఎన్నికల వరకే పరిమితం చేసి పార్టీలకు అతీతంగా అభివృద్ధి నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. కూనంనేని సహకారంతో కార్పోరేషన్ అభివృద్ధిని ఉరకలు వేయిస్తామని తెలిపారు. కార్పోరేషన్ మేయర్ బాధ్యతను కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి చేపట్టడం గర్వించదగ్గ విషయం అని, మరింత బాధ్యతతో పని చేస్తామన్నారు. కార్పోరేషన్ పరిధిలోని 23 కార్పోరేట్ స్థానాలను అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారికి, బాధ్యతలు చేపట్టిన కార్పోరేటర్లకు పాషా శుభా కాంక్షలు తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థుల విజయం కోసం శ్రమించిన పార్టీ, ప్రజా సంఘాలు, అభిమానులకు ఆయన అభినందనలు తెలిపారు.



# వైరా మున్సిపాలిటీ తొలి చైర్‌పర్సన్‌గా డాక్టర్ చంద్రకళ

**-మున్సిపాలిటీ అభివృద్ధిపై చంద్రకళ మార్క్**
**-స్టెతస్కోప్ పట్టిన చేతితో అభివృద్ధి పనుల వైపు**
**-సేవా కార్యక్రమాల్లో ప్రజల మన్నలను పొందిన కాపా కుటుంబం**
**-ప్రజాప్రతినిధిగా ప్రజల్లోకి..**



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో గత 20 సంవత్సరాలుగా వైద్య వృత్తిలో ఉండి స్టెతస్కోప్ పట్టిన డాక్టర్ చంద్రకళ నేటి నుండి ప్రజల అభివృద్ధి పనులు వైపు మున్సిపాలిటీ తొలి మహిళగా ప్రజాక్షేత్రంలోకి అడుగుపెడుతున్నారు. వైరా మున్సిపాలిటీ తొలి మహిళా చైర్‌పర్సన్‌గా నిలిచిపోనున్నారు. స్టెతస్కోప్ పట్టిన చేతులతో భట్టివిక్రమార్క సహకారంతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా నుండి డాక్టర్ కాపా మురళీకృష్ణ , చంద్రకళ దంపతులు సేవా కార్యక్రమాల్లో ప్రజల మధ్య ఉంటూ చెరగని ముద్ర వేసుకున్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచారు. నేడు వారి సేవలను గుర్తించి మున్సిపాల్ ఎన్నికల్లో ప్రజలు గెలిపిస్తే పార్టీ పెద్దలు వారికి పెద్ద పీఠ వేస్తూ చైర్మన్ కట్టబెట్టారు. ఏ పదవి లేకుండానే ఇన్ని రోజులు ప్రజలకు సేవ చేసిన కాపా కుటుంబం తొలిసారి ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు వచ్చారు. ఇప్పటివరకు వైరా మున్సిపాలిటీలో ఉన్న సమస్యలను సైతం పరిష్కరించి అభివృద్ధి వైపు నడిపించేందుకు డాక్టర్ చంద్రకళ సిద్ధమయ్యారు. గ్రామీణ ప్రాంత ప్రజల అభిమానాన్ని పొందిన డాక్టర్ కాపా చంద్రకళ ఇప్పుడు మున్సిపాలిటీలోని ప్రజల హృదయాలను గెలిచేందుకు సిద్ధమయ్యారు. వైరా మున్సిపాలిటీలో కాపా కుటుంబం అంటే తెలియని వారు లేరు. ప్రతిఒక్కరికి గుర్తు వచ్చే కుటుంబం కాపా కుటుంబం. అలాంటి కుటుంబంలోని మహిళలకు చైర్‌పర్సన్ ఇవ్వడం పట్ల పెద్ద ఎత్తున అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపాలిటీ అభివృద్ధిపై కాపా చంద్రకళ మార్క్ కనబడుతుంది. ఆ మార్క్ ఏ విధంగా ఉంటదో అనే దానిపై కూడా ఇప్పటికే కాపా కుటుంబం కాంగ్రేస్ పార్టీ పెద్దలతో చర్చల సైతం ప్రారంభించారు. పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి మున్సిపాలిటీని సుందరంగా తయారు చేయనున్నారు.

# ఉప ముఖ్యమంత్రి భట్టిని కలిసిన చైర్‌పర్సన్ చంద్రకళ

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాల్ చైర్‌పర్సన్‌గా ప్రమాణస్వీకారండాక్టర్ కాపా చంద్రకళ సోమవారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ, మాజీ కాంగ్రేస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌లతో కలిసి మధిర వెళ్లి ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కలిసి తన ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క నూతన చైర్‌పర్సన్ శుభాకాంక్షలు చెప్పిన అనంతరం భట్టివిక్రమార్క మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రగామిగా ఉంచి రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే బాధ్యత నాది అని అన్నారు. వైరా మున్సిపాల్ రెండో చైర్మన్‌గా, తొలి మహిళా చైర్మన్‌గా డాక్టర్ కాపా చంద్రకళకు భట్టివిక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిగా చైర్మన్ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ముందు తాను ఇచ్చిన హామీలను నెరవేర్చుతానని, వైరా మున్సిపాలిటీలో కాంగ్రేస్ పార్టీకి ఓటు వేసి గెలిపించిన ప్రతి ఓటరుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో అన్ని వర్గాల ప్రజలకు లయన్స్‌క్లబ్ ద్వారా సేవలందిస్తున్న డిస్ట్రిక్ట్ ఫాస్ట్ గవర్నర్ కాపా మురళీకృష్ణ, చంద్రకళ దంపతులను రాజకీయాల్లో కూడా రాణించాలని అభినందించారు. వీరి వెంట 4, 20 వార్డు కౌన్సిలర్లు నిమ్మతోట శ్రావణి, వుంద్రు వరలక్ష్మి , మాజీ కౌన్సిలర్ లగడపాటి రాజ్యలక్ష్మి , లగడపాటి ప్రభాకర్‌రావు, వుంద్రు శ్యామ్‌బాబు, నారపనేనిపల్లి సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌రెడ్డి, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



# శీతల శవ పేటికను బహూకరించిన పెదిరెడ్ల బ్రదర్స్




**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండలంలోని నెల్లిపాక పంచాయితీకి శీతల శవ పేటికను బహుకరించారు. నెల్లిపాక బంజర గ్రామానికి చెందిన పెదిరెడ్ల శ్రీనివాసరావు, మధు, నరసింహారావు ముగ్గురు అన్నదమ్ములు వారి అమ్మానాన్నలు పెదిరెడ్ల జానకమ్మ, బాబురావు జ్ఞాపకార్థంగా గ్రామ పంచాయితీకి రూ 66వేల విలువల గల శీతల శవ పేటికను దానంగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పెదిరెడ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ వారి అమ్మగారు నాన్న చనిపోయినప్పుడు ఫ్రీజర్ లేకపోవడం వల్ల పడ్డ ఇబ్బందులను గుర్తు చేసుకొని గ్రామ పంచాయితీలో అటువంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఈ ఫ్రీజర్ను గ్రామ పంచాయితీకి దానం చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ సర్పంచ్ మండల్ రామకృష్ణ మాట్లాడుతూ శీతల శవ పేటికను బహుకరించిన పెదిరెడ్ల బ్రదర్స్‌కు ధన్యవాదాలు తెలిపారు. గౌతమి స్ఫూర్తి ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలకు అన్ని రకాలుగా సహాయం అందించారని, అదే విధంగా గ్రామ పేద పిల్లలకు, పేదవాళ్లకు వైద్య సహాయం నిమిత్తం ఎంతో ఆర్థిక సహాయం అందించారని ఈసందర్భంగా పెదిరెడ్ల బ్రదర్స్‌ను గ్రామ పంచాయితీ తరపున ఘనంగా సన్మానిస్తున్నామని వారి అన్నదమ్ములకు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో నెల్లిపాక గ్రామ పంచాయితీ పాలకవర్గం, గ్రామ పెద్దలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీ వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు




**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండలంలోని వార్డు సభ్యులకు రెండు విడుతలుగా ఐదు రోజుల పాటు మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో ముత్యాలరావు ప్రారంభించారు. మొదటి విడతలో 12 గ్రామ పంచాయితీల వార్డు సభ్యులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమాన్ని గ్రామ పంచాయితీ వార్డు సభ్యులు సమర్థంగా వినియోగించుకుని తమ గ్రామ పంచాయితీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. రెండవ విడత శిక్షణ కార్యక్రమం మిగిలిన 12 గ్రామ పంచాయితీలకు ఈనెల 23వ తేదీ నుండి 27వ తేదీ వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో యూడీసీ డి పద్మావతి, అశ్వాపురం గ్రామ పంచాయితీ కార్యదర్శి దాసరి మల్లేశం, టీఓటీలు, వివిధ గ్రామాల గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రియుడి ఇంటి ముందు బైఠాయించిన యువతి



**ప్రజాపక్షం/కూసుమంచి :** ప్రేమించి మోసం చేశాడంటూ ప్రియుడి ఇంటి ముందు యువతి బైఠాయించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈవిషయంపై బాధిత యువతి తెలుపుతున్న వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం పినపాక పట్టినగర్ గ్రామానికి చెందిన తనను కూసుమంచి మండల పరిధిలోని ముత్యాలగూడెం గ్రామానికి చెందిన పగిళ్ల మనోజ్ గత కొంత కాలం క్రితం నుండి ప్రేమిస్తున్నాడని, తీర పెళ్లి చేసుకుంటానని నమ్మించి పెళ్లి కుదరదని నిరాకరించాడని ఆవేదన వ్యక్తం చేసింది. కావున తమ బంధువులతో కలిసి ముత్యాలగూడెం గ్రామంలోని మనోజ్ ఇంటి ముందు తన బాధను ఆవేదనను తెలుపుతున్నానని, నాకు న్యాయం కావాలని కోరారు.

# నృత్యాలతో సాగిన శివపార్వతుల ఊరేగింపు



**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లిలోని శ్రీ గురు హరిహర క్షేత్రంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శివ కళ్యాణోత్సవాలు సోమవారం మహా పూర్ణాహుతితో ముగిశాయి. ఈసందర్భంగా మందిరంలో పూజ అభిషేకాలు రుద్రహోమాలు నిర్వహించి, అనంతరం పూర్ణాహుతిని జరిపారు. అనంతరం 1000 మందిపైగా భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం విద్యుత్ దీపాలతో అలంకరించిన పూల రథంలో శివపార్వతులను గ్రామంలో భక్తులు సాంప్రదాయ నృత్యాలు కోలాటాల మధ్య వైభవంగా ఊరేగింపు జరిపారు.

# అంబేద్కర్ విగ్రహం ముందు గోపి మౌన ప్రదర్శన



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రధాని నరేంద్ర మోడీ తీసుకుంటున్న నిరంకుశ నిర్ణయాలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మౌన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ, రేణుకా చౌదరిలపై జారీ చేసిన సభా ఉల్లంఘన నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురిజాల గోపి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. రాహుల్ గాంధీ, రేణుకా చౌదరి వంటి సీనియర్ నాయకులపై అనవసర ఆరోపణలు చేయడం సరికాదని, ఇది ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని గోపి పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తమ నిరసన కొనసాగుతుందని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వరకు పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనం సరోజ, ఎండి షబానా, కోరి శ్యామల, దేరంగుల సుజాత, రెడ్డిబోయిన రేణుక, కన్నాపురం శైలజ, సౌజన్య డాకూరి, లక్కీశెట్టి హేమలత, సీనియర్ నాయకులు ఎండీ షేరిఫ్, పింగళి మాధవ రెడ్డి, వెంకట చారి, యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# గోపాలమిత్ర ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం



**ప్రజాపక్షం/వైరా :** మండల పరిధిలోని గొల్లనపహాడ్ గ్రామంలోని పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువుల గర్భకోశ వ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ ఆళ్ల వెంకట్రావు, ఉప సర్పంచ్ వెంపటి రాధ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి యం. రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో సకాలంలో పశువులకు కృత్రిమ గర్భదారణ చేయించడ వల్ల కలిగే లాభాల గురించి, గర్భకోశ వ్యాధులు, సీజనల్ వ్యాధులు గ్రామంలోని రైతులకు అవగాహన కలిపించారు. గ్రామంలోని 25 పశువులకు, 10 పశువులకు సూడి పరీక్షలు, 20దూడలకు,120 గొర్రెలకు నత్తల నివారణ మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెటర్నరీ పెరాస్ట్ ఆఫ్ డాక్టర్ సురేష్, రాము, పంచాయతీ వార్డు మెంబర్లు నాగేశ్వరరావు, మాధవరావు, రాజేంద్రప్రసాద్, గోపాలమిత్ర సూపర్‌వైజన్ ఎస్కె. అబ్దుల్‌మీరా, గోపాలమిత్రలు ఎస్కె. ఖాసీం, ప్రభాకర్, శేషగిరి, ఎస్కె. సుబానీ, వెంకయ్య, నరేష్ పాల్గొన్నారు.